సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



మొరాయిస్తే వెంటనే మరమ్మతు

మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరలో ఆర్టీసీ బస్సుల వైఫల్యాలకు తావులేకుండా అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. - 8లో▸



మేడారంలో నిండుగా మొక్కులు

సమ్మక్క సారలమ్మలకు భక్తులు శనివారం నిండుగా మొక్కులు సమర్పించారు. అనంతరం కంకవనాల్లో వంటలు చేసుకుని భోజనాలు చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/19^0$

వాతావరణం

ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ క్రమంగా పెరుగుతుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

లోక్‌అదాలత్‌లో 113 కేసులు పరిష్కారం



భూపాలపల్లి రూరల్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన స్పెషల్ లోక్ అదాలత్‌కు భారీ స్పందన వచ్చింది. 113 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు అధికారులు తెలిపారు. లోక్ అదాలత్‌లో ప్రిసైడింగ్ ఆఫీసర్లు రామచంద్రరావు, అఖిల, బెంచ్ మెంబర్లుగా న్యాయవాది మంగళపల్లి రాజీకుమార్, మచ్చ వసంత, వివిధ పోలీసుస్టేషన్ల కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

24 నుంచి టెక్నికల్ కోర్సు పరీక్షలు

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 24 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 27వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని షెడ్యూల్ ప్రకారం పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

రేపు జాబ్ మేళా

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆరూరి శ్యామల శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేరుపొందిన నాలుగు ప్రైవేట్ సంస్థలలో పనిచేసేందుకు 300 ఉద్యోగాలకు ఎంపిక, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు విద్యార్హతల సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డ్, పాన్‌కార్డ్ బ్యాంక్‌పాస్ బుక్ జిరాక్స్ కాపీ, నాలుగు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో సుభాష్‌కాలనీలో ఐటీఐ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 77024 57968 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఈ కేవైసీ తప్పనిసరి

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని ఆహార భద్రత కార్డుదారుల కుటుంబ సభ్యులు ప్రతిఒక్కరు ఈ నెల 29వ తేదీలోపు ఈ కేవైసీ చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాలు, కమిషనర్ ఈ కేవైసీని 100శాతం పూర్తిచేయాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. ఆహారభద్రత కార్డుదారులు తమ సమీప రేషన్ షాపుల్లో ఈకేవైసీ అప్డేట్ చేసుకోవాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

భూపాలపల్లి రూరల్: జిల్లాకేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల 7వ తరగతి విద్యార్థి గండి విశ్వతేజ్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట రజిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వతేజ్ ఈ నెల 13నుంచి గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. పాఠశాలలో విశ్వతేజ్‌ను ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు పోడేటి రాజు అభినందించారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి



భూపాలపల్లి అర్బన్: నైపుణ్యాలను మెరుగుపరుచుకొని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని సంఘమిత్ర డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ హరికృష్ణ తెలిపారు. సంఘమిత్ర డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో కరస్పాండెంట్ గుర్రపు రవీందర్ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా ట్రైనర్ ఓం ప్రకాశ్ మహేంద్ర ప్రైడ్ టాస్క్ తరగతులు నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ హరికృష్ణ హాజరై మాట్లాడుతూ.. గత ఆరు రోజులుగా నేర్చుకున్న గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు స్కిల్స్, మోటివేషన్ స్పీచ్‌లను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందాలన్నారు. త్వరలో కంపెనీ డ్రైవ్ నిర్వహించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యారంటీలకే పెద్దపీట

ఉమ్మడి వరంగల్‌లో పలువురికి ఊరట

- ఇరిగేషన్, వ్యవసాయానికి ప్రోత్సాహం
- 2024–25 బడ్జెట్‌లో జిల్లా ప్రజలకు ప్రభుత్వం భరోసా
- దేవాదుల, ఎస్సారెస్పీ స్టేజ్–2, మినీ కాళేశ్వరం ప్రాజెక్టుల పూర్తిపై ఆశలు
- మహాలక్ష్మి, గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్‌లకు మోక్షం
- 2024–25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై భిన్నస్వరాలు



సాక్షిప్రతినిధి, వరంగల్: 2024–25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఉమ్మడి వరంగల్ ప్రజలకు ఊరటనిచ్చింది. 2023 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పేర్కొన్న పలు పథకాలను అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,75,891 కోట్ల అంచనాలతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను అసెంబ్లీలో మంత్రి భట్టి విక్రమార్క శనివారం ప్రవేశపెట్టగా.. ఆరు గ్యారంటీల కింద ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రయత్నంగా రూ.53,196 కోట్లు ప్రకటించి నిధుల కేటాయింపులో పెద్దపీట వేశారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా తదితర పథకాలను దృష్టిలో పెట్టుకుని రూ.19,746 కోట్లు కేటాయించారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన రూ.28,024 కోట్లలో ఉమ్మడి వరంగల్‌లో దేవాదుల, ఎస్సారెస్పీ – 2, మినీ కాళేశ్వరం తదితర ప్రాజెక్టులకు కేటాయింపులపై ఆశలు రేకెత్తుతున్నాయి.

రైతుకు భరోసా.. ఇరిగేషన్‌పై ఆశలు..

ఓటాన్ అకౌంట్‌లో రైతులు, రైతుకూలీలు, సాగునీటి ప్రాజెక్టులకు నిధుల అంచనాలు పెరిగాయి. ఉమ్మడి వరంగల్‌లో 15,01,109 ఎకరాల్లో 4,33,229 మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో 4,09,098 మంది రైతులకు బీమా సౌకర్యం కలగనుంది. 9,02,099 ఎకరాలకు పంటల బీమా చెల్లించారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే ఉమ్మడి జిల్లాలో 2,50,107 మందికి లబ్ధి చేకూరనుంది. కాళేశ్వరం ప్రాజెక్టుకంటే ముందు దేవాదుల ఎత్తిపోతల, ఎస్సారెస్పీ–1, 2ల ద్వారా సాగునీరు అందించేందుకు పనులు చేపట్టారు. ఎస్సారెస్పీ– 1 పనులు పూర్తి కాగా 2004 నుంచి దేవాదుల ప్రాజెక్టు పూర్తి కాలేదు. భూసేకరణకు నిధులు లేక కాల్వల నిర్మాణం ఆగిపోయింది. అలాగే భూపాలపల్లి, మంథని నియోజకవర్గాల్లో ఐదు మండలాలకు సాగునీరు అందించే మినీ కాళేశ్వరం ప్రాజెక్టు నిధులు వచ్చే అవకాశం ఉంది.

సర్కారు బడులకు నిధులు.. నిరుద్యోగులకు శుభవార్త..

ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రోత్సహించడానికి రూ.21,389 కోట్లు కేటాయించింది. ఉమ్మడి వరంగల్‌లో మొత్తం 3,331 ప్రభుత్వ బడులు ఉండగా, అందులో 4,67,011 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రహరీగోడలతోపాటు మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈసారి నిధులు వెచ్చించనున్నారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. టీఎస్‌పీఎస్సీ ద్వారా భారీగా ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నామన్న ప్రకటనతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మెగా డీఎస్సీ, పోలీసు కానిస్టేబుళ్ల నియామకం చేపట్టనున్నామన్నారు. దీంతో ఉమ్మడి వరంగల్‌లో ఉన్న సుమారు 5.78 లక్షల మేర ఉన్న నిరుద్యోగుల్లో కొందరికన్నా ఉద్యోగాల భర్తీ ప్రకటన శుభవార్తే.

ఆరు గ్యారంటీలు.. ఆశాజనకాలు..

- కాంగ్రెస్ ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో చేర్చిన ఆరు గ్యారంటీ పథకాలకు బడ్జెట్‌లో నిధులు ప్రకటించింది.
- అధికారులు ప్రజాపాలన తర్వాత ప్రకటించిన లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఒక కార్పొరేషన్, తొమ్మిది మున్సిపాలిటీలు, 1,708 గ్రామపంచాయతీలుండగా మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు రూ.2,500 చొప్పున సుమారు 7.21 లక్షల మందికి ఇవ్వాల్సి వస్తుంది.
- ఆర్టీసీ బస్సుల్లో వరంగల్ రీజియన్‌లో రోజుకు సగటున సుమారు 55 వేల మంది మహిళలు ఉచితంగా రాకపోకలు సాగిస్తున్నారు.



- అదే విధంగా 6,10,220 గ్యాస్ సిలిండర్ కనెక్షన్లు ఉండగా, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకంకింద వీరందరికీ అందజేయనున్నారు.
- ఇందిరమ్మ గృహ నిర్మాణం కోసం ఇప్పటికే 2.50 లక్షల మందిని అర్హులుగా రెవెన్యూ అధికారులు గుర్తించారు.
- గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల లోపు కరెంట్ వాడిన 6,12,901 మందికి ఉచిత విద్యుత్ సౌకర్యం కలగనుంది.
- చేయూత పథకం కింద కూడా ఆసరా పింఛన్లను రూ.4 వేలు పెంచుతామన్న హామీ మేరకు 4,61,900 మంది లబ్ధి కలగనుంది.



ఐటీ, ఉపాధి అవకాశాలపై ఆశలు..



కౌలు రైతులకు బీమా, రైతు భరోసా వర్తింపజేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడం ద్వారా భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న సుమారు 1,02,021 మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. గిగ్ వర్కర్ల సంక్షేమానికి సామాజిక భద్రత స్కీమ్ కింద రూ.5 లక్షల ప్రమాద బీమా పథకం ద్వారా వివిధ వర్గాలకు చెందిన కార్మికులతో పాటు 4,891 మంది జర్నలిస్టులకు ప్రయోజనం కలగనుంది. దావోస్ పర్యటన ద్వారా రాష్ట్రానికి రూ.40వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయన్న ప్రకటన నేపథ్యంలో హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను ఐటీ హబ్‌గా అంతే ప్రాధాన్యత దక్కి ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. పీఎం మిత్ర నిధులతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంది. ఐటీ హబ్, టెక్స్‌టైల్ పార్కు, మడికొండ పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలపై ఆశలు రేకెత్తుతున్నాయి.

బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం..



రూ.21,389 కోట్లు విద్యారంగానికి కేటాయించడం స్వాగతిస్తున్నాం. కేటాయింపుల మేరకు ఖర్చుచేయాలి. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వడం శుభసూచకం. ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ, సీపీఎస్ అంశాలు లేకపోవడం బాధించింది. **- మధుసూదన్, ఉపాధ్యాయ సంఘం నాయకుడు**

పెండింగ్ బిల్లులపై ప్రస్తావనేది..



ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి రెండేళ్లుగా అనేక రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులను ఈ ఆర్థిక సంవత్సరంలోనే క్లియర్ చేయాలి. పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు రూ.500 కోట్లు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల భవన నిర్మాణాలకు రూ.1,250 కోట్లు, యూనివర్సిటీలకు రూ.500 కోట్ల నిధులు కేటాయించడం హర్షించదగిన విషయం. గతంలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రారంభించిన పథకం పనులు పూర్తికాలేదు. **- సుబాకర్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు**

ఆరు గ్యారంటీలకు ప్రాధాన్యం



ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. వీటి అమలుకు రూ.53,196 కోట్లు కేటాయించం హర్షణీయం. అలాగే, వ్యవసాయం, నీటి పారుదల, విద్యుత్, విద్య రంగాలకు కేటాయింపులు బాగున్నాయి. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి రూ.34,897 కోట్లు కేటాయింపు ఉత్తమమైనదే. **- త్రిపురనేని గోపిచంద్, సీఏ, ఉమ్మడి వరంగల్ జిల్లా టాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు**

సంక్షేమం దిశగా తొలి అడుగు



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ సంక్షేమం దిశగా తొలి అడుగు పడినట్లుగానే భావించాలి. బడ్జెట్‌లో 6 గ్యారంటీలకు రూ.53,196 కోట్లు కేటాయించడం బాగుంది. విద్య, వ్యవసాయ రంగానికి మరిన్ని నిధులు ఇస్తే బాగుండేది. గ్రామీణ అభివృద్ధి, నీటిపారుదల రంగానికి కేటాయింపులు పెంచడాన్ని ఆహ్వానిస్తున్నాం. **- డాక్టర్ తిరునహరి శేషు, అర్థశాస్త్ర అధ్యాపకుడు, కేయూ**

రోడ్డు భద్రతా చర్యలు పాటించాలి



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ నరేష్‌కుమార్

భూపాలపల్లి రూరల్: ప్రజలు, వాహనదారులు రోడ్డు భద్రతా చర్యలు పాటించాలని అదనపు ఎస్పీ నరేష్‌కుమార్ సూచించారు. జిల్లాకేంద్రంతో పాటు వివిధ మండలాల్లో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడ్డ వారికి శనివారం జిల్లాపోలీస్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. కుటుంబసభ్యులకు సైతం అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపబోమని పట్టుబడ్డ వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రవీందర్, ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ సైట్ పరిశీలన



సైట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రమాదేవి

మల్హర్: మండలంలోని తాడిచర్ల శివారులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆర్‌అండ్‌ఆర్ సైట్‌ను భూపాలపల్లి ఆర్డీఓ రమాదేవి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పనుల్లో వేగం పెంచి, మౌలిక వసతులతో కూడిన కాలనీని నిర్వాసితులకు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ సరిత ఉన్నారు.

దారులన్నీ మేడారంవైపే..



సింగారం నుంచి మేడారం వెళ్తున్న వాహనాలు

మహాముత్తారం: సమ్మక్క సారలమ్మ మహాజాతర ఇంకా 11రోజులు ఉన్నప్పటికీ ముందస్తు మొక్కుల కోసం భక్తులు భారీగా తరలి వెళ్తున్నారు. శనివారం చెన్నూర్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఉమ్మడి కరీంనగర్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి మహాముత్తారం మండలం మీదుగా నిమ్మగూడెం, బోర్లగూడెం, రేగులగూడెం, సింగారం ప్రధాన రహదారి నుంచి భారీగా వాహనాలు తరలివెళ్లాయి. అటవీ గ్రామాల్లో అక్కడక్కడ భక్తులు వనభోజనాలు చేసుకుని సేదదీరారు.

17న జెడ్పీ సమావేశం

భూపాలపల్లి రూరల్ : ఈనెల 17న ఉదయం 10గంటలకు జిల్లాకేంద్రంలోని ఇల్లందు క్లబ్‌హౌస్‌లో జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి జిల్లా పరిషత్, మండల పరిషత్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

డ్రోన్ ద్వారా తీసిన జంపన్నవాగు ఏరియల్ వ్యూ



ఎక్కడ ఏముందో..?

- మేడారం వచ్చే భక్తులకు అణువణువూ తెలిసేలా చర్యలు
- జాతరలో డ్రోన్‌తో సర్వెలెన్స్ సర్వే

ఏటూరునాగారం: మేడారం జాతరకు వచ్చే భక్తులకు అణువణువూ తెలిసే విధంగా పోలీసు సిబ్బంది డ్రోన్‌తో సర్విలెన్స్ సర్వే చేపట్టారు. పస్రా నుంచి తాడ్వాయి మీదుగా మేడారం వరకు రోడ్డు, పార్కింగ్ స్థలాలు, ఆర్టీసీ బస్టాండ్, గద్దెలు, జంపన్నవాగుతోపాటు అనేక ప్రాంతాలను సర్వేలో నిక్షిప్తం చేశారు. డ్రోన్ ద్వారా ఎక్కడ ఏ ప్రదేశం ఉందని ఏరియల్ వ్యూ తీశారు. వీవీఐపీలు, వీఐపీలు, సాధారణ భక్తులు సైతం రోడ్డు మ్యాప్, పార్కింగ్ స్థలాలు, రోడ్డు ఎటు నుంచి వెళ్తుందనే విధంగా చిత్రీకరించారు. ఆ వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియా, ఫేస్‌బుక్, ట్విట్టర్, తదితర గ్రూపుల్లో పంపించనున్నారు.

ఒక్కో పార్కింగ్‌కు కోడ్

తాడ్వాయి, పస్రా నార్లాపూర్, ఊరట్టం, కొండాయి ఈ ప్రాంతాలనుంచి మేడారం జాతరకు ఎలా చేరుకుకోవాలనే ఉద్దేశంతో ఒక్కో పార్కింగ్ కోడ్‌ను కేటాయించారు. ఏ1, ఏ2, సీ1, సీ2 ఇలా నంబర్లు ఇస్తూ అడ్రస్‌లను ల్యాండ్ మార్కింగ్స్ కూడా ఇవ్వనున్నారు. దీనివల్ల వారి కుటుంబ సభ్యులు ఏ ప్రాంతంలో ఉందనేది సులభంగా తెలిసిపోయే విధంగా ఈ సర్విలెన్స్ సర్వే చేపట్టారు. మేడారంలో విధులు నిర్వర్తించే పోలీస్ ఉన్నతాధికారులనుంచి కింది స్థాయి సిబ్బందికి సైతం ఈ వీడియోలు, ఫొటోలను షేర్ చేస్తూ భక్తులకు అవగాహన కల్పించనున్నారు. జాతర ఈనెల 21న ప్రారంభం నేపథ్యంలో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండడంతో సహాయక అధికారుల నంబర్లను కూడా పొందుపర్చనున్నారు. సర్వేతో భక్తులు సులభంగా వచ్చిపోయే అవకాశం ఉంటుంది.



డ్రోన్‌తో రూట్ సర్విలెన్స్ సర్వే చేపడుతున్న పోలీసులు సిబ్బంది

కానరాని అభివృద్ధి

- శిథిలావస్థకు చేరిన కాళేశ్వరం వసతి గృహాలు
- 2017లోనే రూ.25కోట్లతో పనులు ప్రారంభం
- నేటికీ పూర్తికాని వైనం
- భక్తులకు అందుబాటులో లేక ఇబ్బందులు
- అధికారుల నిర్లక్ష్యంతో తిప్పలు

కాళేశ్వరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనుల జాడ కానరావడం లేదు. పాత వసతి గృహాలు శిథిలావస్థకు చేరి భక్తులకు అందుబాటులో లేకుండా పోయాయి. ఈ విషయంలో దేవాదాయశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. రూ.25కోట్లతో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కాళేశ్వరాలయం అభివృద్ధికి 2016 మే2న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.25కోట్ల నిధులు మంజూరు చేసింది. 2017 జూలైలో పరిపాలన అనుమతులు వచ్చాయి. దేవాదాయ, పంచాయతీరాజ్, హార్టికల్చర్, ఫారెస్ట్ శాఖలు రూ.25కోట్ల నిధులతో ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టాయి. ఈ క్రమంలో క్యూకాంప్లెక్స్ భవనం, ప్రసాదశాల, ఆలయం చుట్టూరా సాలహారం, అనివెట్టి మండపం, కల్యాణ మండపం, పార్వతీ ఆలయం, ఆర్చీగేటు నిర్మాణాలు పూర్తయినా ప్రారంభించలేదు. రూ.8కోట్ల వ్యయంతో చేపట్టిన 100గదుల నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. విద్యుత్, డ్రెయినేజీ పనులు పూర్తికాలేదు.

స్థలాలు లేక..

అపరకర్మ మండపం, డార్మెటరీ హాల్ నిర్మాణాలు ఇంకా మొదలు కాలేదు. అపరకర్మ మండపానికి స్థలం ఎంపిక పరిశీలనలో ఉంది. మండపం పూర్తయితే ప్రహరీ నిర్మించాల్సి ఉంది. ఉద్యానవనశాఖ ద్వారా పార్కులు, పూలవనం పనులు చేపట్టాల్సి ఉన్నా.. ఆ శాఖ ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఈ విషయంలో సంబంధిత అధికారులు, దేవదాయశాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

శిథిలావస్థలో వసతిగృహాలు..

కాళేశ్వరాలయంలో గతంలో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వినియోగంలో లేవు. వాటిని తొలగించి కొత్త నిర్మాణాలకు ఉపయోగించవచ్చు. కానీ దేవాదాయశాఖ మాత్రం అటువైపు ఆలోచనలు చేయడం లేదు. గుప్తకాటేజీ పోలీస్‌స్టేషన్‌కు ఉత్సవాల సమయంలో అప్పుడప్పుడు వాడుతున్నారు. హనుమంతరావు గెస్ట్‌హౌస్, టీటీడీ దేవస్థానం వసతి గృహాలు కూలిపోయే దశకు చేరాయి. ప్రస్తుతం ఉన్న శ్రీరాజరాజేశ్వర వసతి గృహం, సింగరేణి సంస్థ నిర్మించిన వసతి గృహం, పర్యాటక శాఖ ద్వారా నిర్మించిన త్రివేణి గెస్ట్‌హౌస్‌లలో కూడా ఏసీలు, మరుగుదొడ్లు సరిగ్గా పని చేయడం లేదు. శివరాత్రి వరకైనా పాతవి బాగు చేయించి, కొత్తగా పూర్తయిన వాటిని ప్రారంభోత్సవాలు, పూర్తికాని వాటిని త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. వేసవికాలంలో ఏసీలు సరిగ్గా లేకపోతే ఆదాయం తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే వసతి గృహాలు బాగులేక వసతిపై ఆదాయం తగ్గుముఖం పట్టింది.

రోడ్డుపై నిద్ర..

కాళేశ్వరం త్రివేణి సంగమంలో మృతుల అస్తికలు కలిపి నిమజ్జనం, పిండప్రదాన పూజలు చేస్తారు. అధిక సంఖ్యలో నిత్యం తరలివస్తారు. దేవాలయం సమీపంలో వసతి లేకపోవడంతో ఆలయం వద్ద బయట రోడ్లపై నిద్రిస్తున్నారు. పాత భవనాలకు మరమ్మతులు చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. వాటి నిర్వహణ కూడా ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తే బాగుంటుంది. కాంట్రాక్టర్లు, ఆయా శాఖల ఇంజనీరింగ్ విభాగాలు నిద్రమత్తులో తేలుతున్నాయి. కొంతమంది కాంట్రాక్టర్లు సకాలంలో బిల్లులు రాక, అంచనాలు పెరిగాయని పనులు చేపట్టడంలో తాత్సారం చేస్తున్నట్లు తెలిసింది.

మంత్రి దృష్టిసారిస్తే..

కాంగ్రెస్ ప్రభుత్వంలో దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంత్రిగా కీలక శాఖలో ఉండడంతో కాళేశ్వరాలయం అభివృద్ధిపై భక్తులు ఆశలు పెట్టుకున్నారు. ఆయన గెలిచిన తర్వాత కాళేశ్వరాలయంలో పూజలు చేసిన సందర్భంలో ఆలయాన్ని గొప్పగా తీర్చిదిద్దుతామని, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. దీంతో ప్రస్తుతం ఆలయంలో నిలిచిన పనులు, చేయాల్సిన అభివృద్ధి, శిథిలావస్థకు చేరిన భవనాలపై శివరాత్రి లోపు కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. ఈవిషయమై ఈఓ మహేష్‌ను ఫోన్‌ద్వారా పలుమార్లు సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



శిథిలావస్థలో త్రివేణి గెస్ట్‌హౌస్



నిర్మాణపనులు ఆగిపోయిన అన్నదాన సత్రం

క్లుప్తంగా

'డైట్' సర్టిఫికెట్ల పరిశీలన

విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని డైట్ సెట్–2023లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఫేజ్ 1, 2లలో హాజరుకాని వారు తమ సర్టిఫికెట్ల పరిశీలనకు ఈనెల 14న హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి తెలిపారు. మొదటి, రెండో దశలో వెబ్ ఆప్షన్ ఇవ్వని అభ్యర్థులు ఈనెల 15నుంచి 17వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వవచ్చని తెలిపారు. 22న సీట్ల కేటాయింపు ఉంటుందని, సీటు వచ్చిన అభ్యర్థులు ఈనెల 23 నుంచి 26 తేదీల మధ్య ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు.

18న జిల్లాస్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్ : వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కన్నా శనివారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ఎదురుగా ఉన్న టీటీడీ కళ్యాణ మండపంలో ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సన్మానం



హెచ్‌ఎంలను సన్మానిస్తున్న డీఈఓలు, జీటీఏ బాధ్యులు

కాళోజీ సెంటర్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) ఆధ్వర్యంలో వరంగల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి సన్మానించారు. ముఖ్య అతిథులుగా వరంగల్ డీఈఓ వాసంతి, హనుమకొండ డీఈఓ అబ్దుల్‌హై హాజరై హెచ్‌ఎంలను అభినందించారు. కార్యక్రమంలో జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మేరోజు బ్రహ్మచారి, కోశాధికారి సపావత్ నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం రవి, అసోసియేట్ అధ్యక్షుడు తాళ్లపెల్లి ప్రకాశ్‌గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గుజ్జ వెంకటేశం, గౌరవ అధ్యక్షుడు పోరెడ్డి బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షుడు సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మొరాయిస్తే వెంటనే మరమ్మతు

మేడారం జాతరలో బస్సుల వైఫల్యాలకు తావు లేకుండా చర్యలు



మేడారంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆర్టీసీ బస్‌స్టాండ్

- 12మొబైల్ టీంల ఏర్పాటు
- నాలుగు మెయింటెనెన్స్ క్యాంపులు
- అన్ని విధాలుగా సిద్ధమవుతున్న ఆర్టీసీ


హన్మకొండ : మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరలో ఆర్టీసీ బస్సుల వైఫల్యాలకు తావులేకుండా టీఎస్ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21నుంచి నాలుగు రోజుల పాటు జరిగే మహా జాతరకు ఈ నెల 18 నుంచి ఆర్టీసీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు 57 పాయింట్ల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళిక ఖరారు చేసింది. కాగా మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన క్రమంలో భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో భక్తుల రద్దీని తట్టుకునేందుకు వచ్చిన భక్తులు వచ్చినట్లుగా వెనువెంటనే చేర వేసేందుకు ఈ సారి ఆరు వేల ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. 18వ తేదీనాటికి వరంగల్ రీజియన్‌కు బస్సులు చేరుకునేలా షెడ్యూల్ ఖరారు చేశారు. కాగా ఆర్టీసీ బస్సులు మార్గమధ్యలో ఆగినా, ఫెయిలైనా, ఇతరత్రా మరమ్మత్తులు వచ్చినా భక్తులు ఏ మాత్రం అసౌకర్యానికి గురి కాకుండా ఉండేందుకు వెంటనే మరమ్మతు చేసేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ మేరకు మొబైల్ టీమ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక మెయింటెనెన్స్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండి నాలుగు చక్రాల వాహనాలు వెళ్లలేని పరిస్థితుల్లో సులువుగా చేరుకునేందుకు ద్విచక్ర వాహనాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు.

అందుబాటులో మొబైల్ టీములు

జాతరలో మొత్తం 12మొబైల్ టీంలు ఏర్పాటు చేస్తున్నారు. మేడారం, తాడ్వాయి. పస్రా, గణపురం, జంగాలపల్లి, గట్టమ్మ, గూడెప్పాడ్, కాటారం, నార్లాపూర్, కామారం పార్కింగ్, కొండపర్తితో పాటు హనుమకొండలో మొబైల్ టీములు అందుబాటులో ఉంటాయి. వీరికి కేటాయించిన పరిధిలో బస్సులు ఫెయిలైనా, ఇతరత్రా సాంకేతిక సమస్యలు వచ్చినా వెంటనే చేరుకుని మరమ్మతు చేసి పంపిస్తారు. బృందంలో ఇద్దరు మెకానిక్‌లు, ఎలక్ట్రిషియన్ ఉంటారు. అక్కడ మరమ్మతు కాకపోతే నిలిచిపోయిన బస్సును తరలించడానికి ప్రత్యేకంగా క్రేన్, ట్రాక్టర్లు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. ప్రత్యేక మెయింటెనెన్స్ క్యాంపులో ఆరుగురు మెకానిక్‌లు, ఇద్దరు ఎలక్ట్రిషియన్‌ల చొప్పున ఉంటారు.

పెట్రోలింగ్ టీములు

మార్గమధ్యలో బస్సులు ఇతరత్రా కారణాలతో నిలపకుండా ఉండేందుకు, ట్రాఫిక్‌లో చిక్కుకున్న వెను వెంటనే తరలించేందుకు 15 పెట్రోలింగ్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఈ పెట్రోలింగ్ టీమ్‌లు వారికి కేటాయించిన ప్రాంతం (సెక్టార్)లో నిరంతరాయంగా పర్యటిస్తూ బస్సుల రాకపోకలను పర్యవేక్షిస్తారు. ఇందులో ఓ అధికారి, సెక్యూరిటీ ఉంటారు.



అన్ని చర్యలు తీసుకుంటున్నాం



మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. భక్తులను క్షేమంగా, సురక్షితంగా చేరవేయడమే మా ధ్యేయం. మార్గమధ్యలో బస్సులు మరమ్మతుకు వచ్చినా వెంటనే రిపేర్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎలాంటి సమస్య ఎదురైనా సులువుగా అధిగమించేందుకు అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

-జాస్తి శ్రీలత, ఆర్టీసీ, వరంగల్ ఆర్ఎం

అపరాలు.. ఆరోగ్యకరం

- ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ ఆర్.ఉమారెడ్డి

హన్మకొండ : అపరాలతో తయారు చేసిన ఆహారం తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, అపరాల సాగు పెంచాల్సిన అవసరం ఉందని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. శనివారం వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ప్రపంచ అపరాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలెక్టరేట్‌లో కలిసి అందజేశారు. అదే విధంగా వరంగల్ పోలీసు కమిషనర్‌కు, జిల్లా వ్యవసాయాధికారి ఉషా దయాళ్‌కు, హనుమకొండ ఏడీఏ దామోదర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఆయా విభాగాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్యాపకులకు అందజేసి అపరాలపై అవగాహన కల్పించారు. అలాగే ములుగు రోడ్డులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఎదుట ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి బాటసారులకు, బస్సుల్లో వెళ్తున్న ప్రయాణికులకు అపరాల తినుబండారాలు అందించి చిరుధాన్యాల సాగు అవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆర్.ఉమారెడ్డి మాట్లాడుతూ అపరాల సాగు విస్తీర్ణం పడిపోవడం బాధాకరమన్నారు. అపరాలలో అనేక పోషకాలుంటాయని, ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. ముఖ్యంగా పప్పు దినుసులు తినడం ద్వారా అవసరమైన ప్రొటీన్లు పొందవచ్చన్నారు. ఏడీ డాక్టర్ వెంకట్ రెడ్డి, శాస్త్రవేత్తలు ఎన్.సంధ్యారాణి, దిలీప్, జి.వీరన్న, వి.వెంకన్న, ఎం.మధు. జి.పద్మజ, డి.వీరన్న పాల్గొన్నారు.



చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను కలెక్టర్‌కు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

మేడారంలో మెండుగా మొక్కులు

వనదేవతలను దర్శించుకున్న భక్తులు



వనదేవతల గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఏటూరునాగారం : మేడారంలోని సమ్మక్క–సారలమ్మలకు భక్తులు శనివారం మెండుగా మొక్కులు సమర్పించారు. జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన కల్యాణకట్ట వద్ద తలనీలాలను సమర్పించి తలస్నానాలు ఆచరించారు. అనంతరం ఎత్తుబంగారంతో వనదేవతల వద్దకు చేరుకొని తల్లిబిడ్డకు మొక్కులు సమర్పించారు. పగిడిద్దరాజు, గోవింద రాజులకు కానుకలు చెల్లించారు. ఒడిబియ్యం అమ్మవారికి అప్పగించారు. గద్దెలపై ఉన్న బంగారం(ప్రసాదంగా) తీసుకొని వెనుదిరిగారు. రద్దీ లేకపోవడంతో అధికారులు భక్తులను గద్దెలపైకి అనుమతి ఇచ్చారు. దీంతో గద్దెల ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు కంకవనాల్లో వంటలు చేసుకొని సంహపక్తి భోజనాలు చేశారు. జంపన్నవాగు, బస్టాండ్ నుంచి ఆటోలు నడపడంతో భక్తులకు నడకబాధలు తప్పాయి. పోలీసులు బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్‌ను మళ్లించారు.



గద్దెల వద్ద సిద్ధం చేసిన హుండీలు

మేడారం జాతరకు గవర్నర్ రాక..

ఏటూరునాగారం : మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు గవర్నర్ తమిళిసై రానున్నార ని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇ లా త్రిపాఠి శనివారం అధికారులను ఆదేశించారు. ఈనెల 21నుంచి మేడారం జాతర ప్రారంభం కానుందని, గవర్నర్ స్వయంగా వనదేవతలకు మొక్కులు చెల్లించనున్నట్లు తెలిపారు. అయితే పర్యటన తేదీలు ఇంకా ఖరారు కాలేదన్నారు. అంతేకాకుండా వీవీఐపీలు వచ్చే అవకాశం ఉందని, ప్రొటోకాల్ ప్రకారం కావాల్సిన మర్యాదలు, ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు లోబడి పనులు చేయించాలన్నారు. నాలుగు పకోడ టెంట్లను ఏర్పాటు చేయడం, ఐటీసీ నుంచి ప్రత్యేక కంటైనర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ, దేవాదాయ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు గద్దెల వద్ద నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఆమె వెంట ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, డీపీఓ వెంకయ్య, ఎండోమెంట్ ఈఓ రాజేందర్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సారలమ్మ పూజారి వెంకటేశ్వర్లు ఉన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్



ఎత్తు బంగారం(బెల్లం)తో వస్తున్న భక్తులు

రేషన్ బియ్యం స్వాధీనం

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలోని రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. కాగా యజమాని గోలి సంతోష్ పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి వాటిని సన్న బియ్యంగా మారుస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్రమంగా నిల్వ చేసిన 133 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. సివిల్ సప్లై డీటీలు శ్రీనివాస్, దే వా విచారించి బియ్యాన్ని సీజ్ చేసి గోదాంకు తరలించారు. యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడికి చెందిన ఒకరు, తండధర్మారం గ్రామానికి చెందిన ఒకరు, జనగామ జిల్లా తరిగొప్పుల మండలానికి చెందిన ఒకరు, నర్మెట మండలానికి చెందిన ఓ యువకుడు యాదాద్రి భువనగిరి జిల్లాలో, మేడారం జాతరకు వెళ్తూ ఒకరు మృతిచెందారు.

అత్తారింటికి వెళ్లి వస్తూ..అనంత లోకాలకు..

- స్కూల్ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి



శంకర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



శంకర్ (ఫైల్)

మరిపెడ రూరల్ : అత్తారింటికి వెళ్లి వస్తూ మార్గమధ్యలో స్కూల్ బస్సు ఢీకొట్టగా ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బుర్హాన్‌పురం శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గుండెపుడి గ్రామానికి చెందిన బాదావత్ శంకర్ (27) బొడ్రాయి పండుగ సందర్భంగా తన అత్తగారి గ్రామం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం కందగట్ల గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. కాగా మిర్చితోటకు పురుగు మందు పిచికారీ చేసి తిరిగి అత్తారింటికి వెళ్లాలని స్వగ్రామమైన గుండెపుడికి బయలుదేరి వస్తున్నాడు. మండలంలోని బుర్హాన్‌పురం శివారులో మండలంలోని శ్రీవెంకటేశ్వర మెమోరియల్ (ఎస్వీఎం) పాఠశాలకు చెందిన బస్సు తానంచర్ల వైపుగా వెళ్తోంది. ఎదురుగా వస్తున్న శంకర్ బైక్ అదుపుతప్పి స్కూల్ బస్సును ఢీకొట్టాడు. దీంతో శంకర్ ముఖం, తలకు తీవ్రగాయాలైన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఆరునెలల కుమారుడు ఉన్నాడు. సంఘటన స్థలాన్ని మరిపెడ రెండో ఎస్సై మౌలాన సిబ్బందితో చేరుకుని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు..



మద్దోజు నరేష్ మృతదేహం

ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం సమీపంలో మహబూబాబాద్–సూర్యాపేట జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని తండధర్మారం గ్రామానికి చెందిన మద్దోజు నరేష్(35), గుగులోత్ మంగీలాల్‌తో కలిసి సొంత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై మరిపెడకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న మంగీలాల్ కంట్లో దోమ పడడంతో వాహనాన్ని రోడ్డు పక్కకు ఆపారు. కాగా మరిపెడ నుంచి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం హైదర్‌సాయిపేట గ్రామానికి చెందిన దాసరి మహేందర్ తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నాడు. దీంతో బైక్ అదుపు తప్పి ముందు ఆగి ఉన్న మంగీలాల్ బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో బైక్‌పై కూర్చొని ఉన్న మద్దోజు నరేష్ కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన గుగులోతు మంగీలాల్, దాసరి మహేష్‌ను 108 వాహనం ద్వారా మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..



బాలయ్య (ఫైల్)

తరిగొప్పుల : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి మండలంలో జరిగింది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం .. జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలోని బొంతగట్టునాగారం గ్రామానికి చెందిన సుంకరి బాలయ్య(57) వ్యక్తిగత పనుల నిమిత్తం బొత్తలపర్రె గ్రామానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో హుస్నాబాద్–జనగామ ప్రధాన రహదారిపై ఏడుపోచమ్మలగుడి కూడలి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ బాలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శనివారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



భూక్య జానకిరాం (ఫైల్)

భువనగిరి క్రైం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలోచోటుచేసుకుంది. జనగామ జిల్లా నర్మెట మండలం గండిరామవరం పరిధిలోని మనుబోతుల తండాకు చెందిన భూక్య జానకిరాం(27) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన జానకిరాం విధులకు హాజరయ్యేందుకు శనివారం బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో భువనగిరి పట్టణంలోని బైపాస్ రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మృతుడి వద్ద లభ్యమైన రూ.లక్ష నగదు, ఐఫోన్‌ను 108 సిబ్బంది పోలీసులకు అప్పగించారు.

మేడారం వెళ్తూ ట్రాలీ ఆటో డ్రైవర్..



ట్రాలీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ తరుణ్ మృతదేహం

వెంకటాపురం(ఎం) : మండలంలోని లింగాపూర్ పరిధిలో గల జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన ట్రాలీ ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై చల్లా రాజు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన లోకిని తరుణ్(22) హోటల్ సామగ్రితో ట్రాలీ ఆటోలో మేడారానికి వెళ్తున్నాడు.కాగా, మేడారం నుంచి ములుగుకు వస్తున్న స్కార్పియో అతివేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ తరుణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మరో ఇద్దరితో పాటు స్కార్పియో వాహనంలో ఉన్నవారు సైతం గాయపడడంతో అందరిని చికిత్స నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో డ్రైవర్ ఆత్మహత్య



రాజు(ఫైల్)

వేలేరు : ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ డ్రైవర్ ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై డి.హరిత తెలిపిన వివరాలు.. వేలేరు మండల కేంద్రానికి చెందిన సూత్రపు రాజు(42) టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా, రాజు ఇటీవలే అప్పులు తీసుకువచ్చి కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. రాజు ప్రవర్తన నచ్చక టిప్పర్ యజమాని డ్రైవర్‌ను తొలగించి వేరే వ్యక్తిని నియమించుకున్నాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రాజు శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మహాముత్తారం : పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన మండలంలో జరిగింది. వివరాలు.. మండలంలోని బోర్లగూడెం గ్రామానికి చెందిన రైతు గంధ్ర కిషన్ రావు(32) తన వరిపొలానికి నీళ్లు పెట్టడానికి శనివారం ఉదయం బావి వద్దకు వెళ్లాడు. కాగా కరెంట్ మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా ప్రమాదవశాత్తు వైరు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. సంఘన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి రంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

బెలగవి ఎక్స్‌ప్రెస్ పొడిగింపు



కాజీపేట రూరల్ : కాజీపేట–బెలగవి మధ్య నడిచే డైలీ ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం బెలగవి–భద్రాచలం రోడ్ స్టేషన్ వరకు పొడిగిస్తున్నట్లు శనివారం రైల్వే అధికారులు తెలిపారు.

ప్రత్యేక రైలు వివరాలు..

బెలగవి–భద్రాచలంరోడ్ (07335) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 4వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ప్రతి రోజు కాజీపేట జంక్షన్‌కు 7:33 గంటలకు చేరుతుంది. అదేవిధంగా భద్రాచలంరోడ్–బెలగవి (07336) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు ప్రతి రోజు కాజీపేటకు 19:18 గంటలకు చేరుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్‌కు అప్ అండ్ డౌన్‌లో డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రం, వరంగల్ స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు.